క్లుప్తంగా

అగ్నిప్రమాద బాధితునికి ఆర్థిక సాయం



బాధిత రైతుకు సాయం అందజేస్తున్న పేరాడ తిలక్

నందిగాం: కణితూరుకు చెందిన గిన్ని మల్లేశ్వర రావు పొలంలో ఉన్న రెండు ఎరకాల వరి చేను కుప్పకు గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం నిప్పంటించి దగ్ధం చేశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేరాడ తిలక్ కాలి బూడిద అయిన చేను కుప్పను చూసి చలించిపోయారు. రైతు మల్లేశ్వరరావుకు రూ.10 వేలు ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు. విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మద్దిలోడిపేటకు చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యులు బొద్దంకి బాలరాజు అనారోగ్యానికి గురైనట్లు తెలుసుకున్న తిలక్ అతన్ని పరామర్శించారు. ఎంపీపీ శ్రీరామమూర్తి, అంబోడి విష్ణు, బొమ్మాళి గున్నయ్య, కొంకి చలపతిరావు, తిరుపతిరావు ఉన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

సోంపేట: విద్యతోనే ఏ రంగమైన అభివృద్ధి సాధిస్తోందని సోంపేట సామాజిక ఆస్పత్రి విశ్రాంత సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. సోంపేట పట్టణంలోని కాళింగ సంఘం ఆత్మీయ సమ్మేళనం, వనభోజన మహోత్సవ కార్యక్రమాన్ని బారువ సముద్ర తీరంలో సంఘ అధ్యక్షుడు తమ్మినేని శేషయ్య ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలవురు వక్తలు సంఘం అభివృద్ధి, చేయాల్సిన సేవలను వివరించారు. ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకోవాలన్నారు. పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నారులకు సాంస్కృతిక , క్రీడాపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పండి కృష్ణారావు, డాక్టర్ గోవిందు, డాక్టర్ మూల జోగినాయుడు, మూల వీరన్న, దుప్పల చలపతి, విశ్రాంత ప్రిన్సిపాల్ లచ్చయ్య పాల్గొన్నారు.

గ్రామస్తుల శ్రమదానం



మరమ్మతులు చేస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు రూరల్: తాళబద్ర నుంచి రిట్టపాడు మీదుగా చినవంక వరకు ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు గుంతల మయంగా మారింది. ప్రయాణానికి ప్రజలు ఇబ్బందిపడేవారు. దీంతో రిట్టపాడు గ్రామస్తులు ముందుకు వచ్చి శ్రమదానంతో రోడ్డుకు ఆదివారం మరమ్మతులు చేసి అదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పైల అప్పారావు మాట్లాడుతూ.. రోడ్డు మరమ్మతుకు గురి కావడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని ఈ మేరకు గ్రామస్తులు కొంత మంది ముందుకు రావడంతో తామంతా కలిసి మరమ్మతు చేస్తున్నామన్నారు.

నేడు ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా

కాశీబుగ్గ: కార్గో ఎయిర్‌పోర్టు కోసం బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా పలాస ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం ఉదయం వామపక్ష పార్టీలు, ఏయిర్ పోర్టు భూముల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని కమిటీ ప్రతినిధులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించి అనంతరం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ రాము

టెక్కలి రూరల్: ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని టెక్కలి ఎస్‌ఐ కె.రాము అన్నారు. పిట్టలసరియా గ్రామంలో సంకల్పం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా వ్యవహరించాలని, రోడ్డు నిబంధనలు పాటించాలని అన్నారు.

పచ్చదనంపై గొడ్డలివేటు!

- యథేచ్ఛగా కలప అక్రమ రవాణా
- పట్టించుకోని అటవీ అధికారులు



అమలపాడు ఫారెస్టుబ్లాక్‌లో గొడ్డలి వేటుకు తెగిన సరుగుడు వనాలు

వజ్రపుకొత్తూరు: పచ్చని వనాలు గొడ్డలివేటుకు బలవుతున్నాయి. కొంతమంది అక్రమార్కులు విలువైన చెట్లను నరికివేసి.. వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇచ్ఛాపురం నుంచి పోలాకి వరకు ఉన్న తీర ప్రాంతంలో పచ్చని వనాలు అక్రమార్కుల ధనదాహానికి ఆవిరైపోతున్నాయి. బెండి కొండ రిజర్వు ఫారెస్టులో నీలగిరి చెట్లు మాయమవుతున్నాయి. కటింగ్ ఆర్డర్ లేకుండానే జిరాయితీ భూములు, వన సంవరక్షణ సమితుల్లో పెరిగిన అపారమైన కలప అక్రమార్కులకు చిక్కుతోంది. పగలంతా కటింగ్ చేసి రోడ్ల పక్కనే నిల్వ చేసి రాత్రి వేళ అనకాపల్లి, అమలాపురం ప్రాంతాలకు తరలించుకుపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. తమిళనాడు, కర్ణాటక, కేరళ ప్రాంతాల్లో కలపకు మంచి డిమాండ్ ఉంది. ఈ విలువైన కలప ఎల్లలు దాటించేందుకు కొంతమంది అటవీ శాఖ సిబ్బంది సహకరిస్తున్నట్టు ఆరోపణలున్నాయి.

రిజర్వు ఫారెస్టులో..

వజ్రపుకొత్తూరు మండలంలో అత్యధిక రిజర్వు ఫారెస్టు ఉంది. బెండికొండకు ఆనుకుని 84.34 హెక్టార్‌లు, మెట్టూరు బ్లాక్‌లో 290.8 ఎకరాలు ఉండగా సోషల్ ఫారెస్టు భూములు కిడిసింగిలో 60 ఎకరాలు, కేఆర్‌పేట, మంచినీళ్లపేట, హుకుంపేట, పల్లివూరు, అమలపాడు, కొమరల్తాడ బీట్ పరిధిలో 350 ఎకరాల వరకు భూములు ఉన్నాయి. ఇందులో వన సంవరక్షణ సమితుల ద్వారా దాదాపు రూ.8.6 కోట్లు వెచ్చించి అప్పట్లో జీడి, సరుగుడు, నీలగిరి, అకేషియా తదితర వనాలు పెద్ద ఎత్తున పెంచారు. ప్రస్తుతం అవి రోజు రోజుకూ తరిగిపోతున్నాయి.

ఉద్దానం టు అమలాపురం

జిల్లాలోని ఉద్దానం, తీర ప్రాంతంలో అధికంగా ఉన్న ఫారెస్టు భూముల్లోనే కాక జిరాయితీ భూముల నుంచి టేకు సరుగుడు, పనస కలపను కొంతమంది యథేచ్ఛగా రాజమండ్రి, అమలాపురం, అనకాపల్లి తరలించుకుపోతున్నారు. నాణ్యతను బట్టి అడుగు టేకు కలప రూ.2,200, అకేషియా రూ.1300, పనస రూ.1050 ధర ఉండగా సరుగుడు, నీలగిరి టన్ను రూ.8 వేలు నుంచి 10 వేలు వరకు అమలాపురం, అనకాపల్లి, రాజమండ్రి నుంచి వచ్చే వ్యాపారులు కొనుగోలు చేసి రాత్రి పూట లారీల్లో తరలిస్తున్నారు.

నిబంధనలు బేఖాతర్..

చెట్లు నరకాలన్నా, కోయాలన్నా అటవీ, రెవెన్యూ శాఖల నుంచి కటింగ్ ఆర్డర్ తీసుకోవాలి. దీనికి కొంత చలానా సైతం కట్టాలి. ప్రభుత్వ భూములకైతే ఎలాంటి అనుమతులు ఇవ్వరు. జిరాయితీ భూముల్లో కలప కోయాలంటే టైటిల్ సర్టిఫికెట్, సర్వే నంబరులో ఏఏ రకాలు చెట్లు ఉన్నాయో పరిశీలించి అనుమతులు ఇవ్వాలి. కానీ వీటిని ఎవరూ పట్టించుకోవడం లేదు. పర్యవేక్షించాల్సిన రెవెన్యూ సిబ్బంది, ఫారెస్టు గార్డులు, బీట్ ఆఫీసర్లు, ఎఫ్ఎస్ఓలు అక్రమార్కులతో కుమ్మక్కై కలపను రాత్రి వేళ తరలిచేందుకు సహకరిస్తున్నారనే ఆరోపణలు స్థానికుల నుంచి వస్తున్నాయి.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

కలప అక్రమ రవాణా, చెట్ల నరికివేత విషయాన్ని కాశీబుగ్గ ఫారెస్టు రేంజ్ అధికారి మురళీకృష్ణ నాయుడు వద్ద ప్రస్తావించగా.. బెండికొండ రిజర్వు ఫారెస్టులో కేవలం నీలగిరి వనాలు మాత్రమే ఉన్నాయన్నారు. అక్కడ తమ సిబ్బంది నిత్యం కాపలా ఉంటున్నారని చెప్పారు. నిత్యం వనాలను పరిశీలిస్తున్నామన్నారు. నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. అక్రమార్కులు పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



బెండి కొండ ఫారెస్టు బ్లాక్‌లో తరళించేందుకు రోడ్డు పక్కన ఉంచిన నీలగిరి కలప



లారీలో లోడ్ చేస్తున్న అకేషియా. నీలలగిరి, సరుగుడు కలప

తులసమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఇచ్ఛాపురం రూరల్: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా లొద్దపుట్టిలో పూజలందుకుంటున్న ధనరాజుల తులసమ్మకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆంధ్ర, ఒడిశా ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని బోనాలు సమర్పించారు. సాంస్కృతిక ప్రదర్శనలతో అమ్మవారి ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

బొత్సకు స్వాగతం పలికిన తిలక్



బొత్సకు స్వాగతం పలుకుతున్న తిలక్, నాయకులు

టెక్కలి: శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యన్నారాయణకు వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆదివారం సాదరంగా స్వాగతం పలికారు. టెక్కలిలో ఓ ఆత్మీయ సమావేశానికి హాజరయ్యేందుకు విచ్చేసిన బొత్సను కోటబొమ్మాళి సమీపంలో స్వాగతం పలికి సత్కరించారు. ఈయనతో పాటు కోటబొమ్మాళి, సంతబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యులు దుబ్బ వెంకట్రావు, పాల వసంత్‌రెడ్డి, నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, నాయకులు రోణంకి ఉమా మల్లయ్య, బోయిన నాగేశ్వరరావు, కె.సంజీవరావు, అన్నెపు రామారావు, పి.వెంకట్రావు, దుక్క రామకృష్ణారెడ్డి, సత్తారు సత్యం, బి.గున్నయ్య ఉన్నారు.

తెలికుల సామాజికవర్గ సమస్యలు పరిష్కరించాలి



ఐక్యతచాటుతున్న సంఘ ప్రతినిధులు

టెక్కలి: అఖిలగాండ్ల తెలికుల సంక్షేమ సంఘం సమస్యలు పరిష్కరించే విధంగా ప్రభుత్వం దృష్టి సారించాలని జిల్లా అధ్యక్షుడు కె.ఎల్.ప్రసాద్ కోరారు. ఆదివారం టెక్కలి సమీపంలో వనం-మనం కార్యక్రమం పేరుతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలికుల సామాజిక వర్గం సామాజికంగా, ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందాలని.. దీనికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. బీసీ డిక్లరేషన్ ప్రాతిపదికన ఉచిత విద్యుత్ 300 యూనిట్లు అందజేయాలన్నారు. నూనె గానుగల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు అందజేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు దాసరి జ్ఞానమూర్తి, ఇ.విశ్వనాథం, రామరాజు, ధర్మరాజు, జగన్, మధు, శ్రీనివాస్, రామన్న, రఘురాం, కామేశ్వరావు, బెనర్జీదాస్, మన్మధ, గోవింద్, బాలు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఉచితంగా సుగర్ పరీక్షలు



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధి కాశీబుగ్గ మూడురోడ్లు కూడలి కేటీ రోడ్డులో లయన్స్ క్లబ్ ఆఫ్ పాలబుగ్గ ఆధ్వర్యంలో ఉచితంగా సుగర్ పరీక్షలను ఆదివారం చేశారు. సుగర్ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ పాలబుగ్గ కార్యవర్గ సభ్యులు తూములు శ్రీనివాసరావు, తంగుడు దయకుమార్, మల్లా మనీలకుమార్, బోయిన తరుణ్, మల్లా మనోజ్, పెంట సాగర్ పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తికి పరామర్శ



సుధాకర్‌ను పరామర్శిస్తున్న నాయకులు

సంతబొమ్మాళి: టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన స్థానిక ఎంపీటీసీ సభ్యుడు బి.సుధాకర్‌ను జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కెల్లి జగన్నాయకులు ఆదివారం పరామర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులపై దాడులు చేయడం దారుణమన్నారు. పార్టీ అండగా ఉంటుందని సుధాకర్‌కి ధైర్యం చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మేరుగు అప్పారావు, నక్క భీమారావు, పి.రామకృష్ణ, బాబురావు, నరేష్, పరపటి శ్రీనివాసరెడ్డి, కొన్న శ్రీరాములు, ఎం. భాస్కర్‌రెడ్డి, అప్పన్న, పాపారావు ఉన్నారు.



కవిటి: బల్లిపుట్టుగలో జమునదొళాయి కుటుంబాన్ని పరామర్శిస్తున్న విజయ తదితరులు

జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ

కవిటి : మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన పలువురి కుటుంబాలను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ ఆదివారం పరామర్శించారు. బల్లిపుట్టుగలో మజ్జి నాగరాజు, దొళాయి జమున, ముత్యాలపేటలో దిక్కల జయప్రద చనిపోవడంతో వారి కుటుంబాలను పరామర్శించి సంతాపం తెలియజేశారు. నాయకులు దేవరాజ్‌సాహు, రజనీకుమార్‌దోళాయి, వజ్జ ప్రసాదరావు, మార్పు వెంకటేష్ ఉన్నారు.

ఫ్యామిలీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షునిగా గురునాథ్

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి గ్రామానికి చెందిన శ్రీరామ ఫ్యామిలీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షునిగా గుంటు గురునాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామానికి చెందిన వంద కుటుంబాలు అక్కుపల్లి శివసాగర్ తీరంలో ఉన్న నీలకంఠేశ్వర ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షునిగా కె.ఎల్.నారాయణ, కార్యదర్శిగా మద్దు రాఘవరావు, జాయింట్ కార్యదర్శిగా జయశంకర్, కోశాధికారిగా మురుపల్లి రవీంద్ర ఎన్నికయ్యారు.

లైబ్రరీ సందర్శన



గ్రంథాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న సంతోష్‌కుమార్

కాశీబుగ్గ:

కాశీబుగ్గలోని ఐడీఎస్ఎంటీ మున్సిపల్ కాంప్లెక్స్ రెండో అంతస్తులో ఉన్న లైబ్రరీని మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోష్ ఆదివారం సందర్శించారు. ఇటీవల ఈ గ్రంథాలయంపై 'సాక్షి'లో వచ్చిన కథనాన్ని చూసి లైబ్రరీని ఆయన పరిశీలించారు. తెలుగు దిన పత్రికలు తప్పితే ఇంగ్లిషు పత్రికలు లేని విషయాన్ని గమనించి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వారపత్రికలు, పక్షపత్రికలు, మాస పత్రికలు, త్రైమాస పత్రికలు, వార్షిక పత్రికలు ఏవీ రాకుండా గ్రంథాలయాన్ని ఎలా నడుపుతున్నారని ప్రశ్నించారు. కనీసం పోటీ పరీక్షలకు అవసరమైన అప్‌డేట్ పుస్తకాలు లేకపోతే ఏమి ప్రయోజనమన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావునుఫోన్‌లో సంప్రదించి గ్రంథాలయానికి ఇంగ్లిష్ పత్రికలతోపాటు పోటీ పరీక్షల లేటెస్ట్ మెటీరియల్ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆహార పొట్లాల పంపిణీ



ఆహార పొట్లాలను అందజేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని అనాథులు, యాచికులకు పలాస సత్యసాయి సమితి ప్రతినిధులు ఆహార పొట్లాలను ఆదివారం పంపిణీ చేశారు. జిల్లా సాధన శిబిరం ఇన్‌చార్జి జామి చిరంజీవి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన సేవా కార్యక్రమంలో జోనల్ బాలవికాస్ ఇన్‌చార్జి అరుణ, కో–ఆర్డినేటర్ సునీత, నిర్మల, ఉషారాణి, స్వరూప పాల్గొన్నారు.

చీరే పంటకు రక్ష..



చాలామంది పెరట పంటల సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. ఇంటి ఆవరణలోని ఖాళీ స్థలాల్లో కూరగాయలు, పచ్చిమిర్చి, కరివేపాకు, కొత్తిమీర, పువ్వులు, అల్లం, దుంపజాతులు కుటుంబానికి తగినంత పెంచుకుంటున్నారు. అటువంటి పంటలకు చీడపీడలు దరిచేరకుండా ఉండేందుకు పాతచీరలను రక్షణ కంచెగా ఏర్పాటు చేస్తున్నారు.

–కాశీబుగ్గ

పొంచి ఉన్న ప్రమాదం



వజ్రపుకొత్తూరు మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిపై పూండిగల్లీ గ్రామానికి సమీపాన ఆర్అండ్‌బీ రహదారిపై పెద్ద గొయ్యి ఏర్పడింది. గొయ్యి ఉందంటూ స్థానికులు జెండాను సైతం గోతిలో ఉంచారు. కానీ ఆ జెండా గోతిలో పడినవారి ప్రాణాలను కాపాడగలదా.. మరి ఆర్అండ్‌బీ అధికారులు ఏం చేస్తున్నట్లు.. చిన్న సిమెంట్ పైప్ కల్వర్టు పాడై రాను రాను పెద్ద గోతిలా మారింది. రాత్రి వేళ 16 ప్రమాదాలు జరగగా వాహన చోదకులు క్షతగాత్రులుగా పలాస ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఈ గొయ్యి గత ఆరు నెలలుగా దర్శనమిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు మరమ్మదులు చేయడం లేదు. పెను ప్రమాదం సంభవించక ముందే మేల్కోవాలని వాహన చోదకులు జి.రవిబాబు, ఎం.చిన్నారావు, మోహనరావు, డి.జానకీరావు తదితరులు కోరుతున్నారు.

–వజ్రపుకొత్తూరు

స్వాగత ద్వారం ఏర్పాటు



సోంపేట రైల్వే స్టేషన్‌కు ఉండే స్వాగత ద్వారంలో బోర్డులు తిత్లీ తుఫాన్ సమయంలో పాడయ్యాయి. అప్పటి నుంచి బోర్డులు లేని పరిస్థితి. తాజాగా ఈ రైల్వే స్టేషన్‌కు స్టేషన్ కన్సల్టింగ్ కమిటీ సభ్యులను నియమించిన తర్వాత ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఆదివారం కొత్త స్వాగత బోర్డులను అమర్చారు.

–కంచిలి

మొక్కలను నరికేస్తున్నారు..



మండల కేంద్రమైన నందిగాంకు జీవనాధారమైన సీతసాగరం చెరువు గట్టుపై ఉన్న చందనం మొక్కలను అక్రమార్కులు రాత్రివేళల్లో నరికి వేస్తున్నారు. మూడు రోజులుగా పోలవరం వైపు చెరువుగట్టుపై ఉన్న మొక్కలను రాత్రి వేళ గుర్తు తెలియని వారు నరికి ప్రధాన దుంగలను తీసుకెళ్లిపోయి మిగిలిన చిన్న ముక్కలు విడిచి పెడుతున్నారు. రాత్రి వేళ జరుగుతున్న ఈ తతంగంపై అటవీ అధికారులు దృష్టి సారించి సీతసాగరం గట్టుపై ఉన్న విలువైన చందనం మొక్కలను రక్షించాలని స్థానికులు కోరుచున్నారు.

–నందిగాం

వీరుడి స్మరణలో..



జవాన్ భార్యకు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

టెక్కలి రూరల్: ఉగ్రవాదుల దాడిలో వీరమరణం పొందిన సంతబొమ్మాళి మండలం నరసాపురం గ్రామానికి చెందిన తెలుగు ఆదినారాయణకు ఘన నివాళులర్పించారు. ఆయన 11వ అస్సాం రైఫిల్స్‌లో విధులు నిర్వర్తిస్తుండగా 2003లో జనవరి 8వ త్రిపుర రాష్ట్రంలో అగర్తల వద్ద ఉగ్రమూకల ఎదురుకాల్పుల్లో ప్రాణాలు కోల్పోయారు. ఈయన మరణానంతరం 2007లో భారత సైన్యం సేవా పతకం అందజేశారు. ఈ నెల 3న ఢిల్లీలోని ఇండియా గేట్ సమీపంలో ఉన్న జాతీయ యుద్ధ స్మారకం వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర హోం మంత్రిత్వశాఖ పిలుపు మేరకు వీర జవాన్ ఆదినారాయణ భార్య కమలమ్మ హాజరయ్యారు. అమరవీరుడి త్యాగాన్ని స్మరించుకుంటూ ఆమెకు జ్ఞాపిక అందజేశారు.

ప్రజల పక్షాన పోరాడుదాం



పార్టీ కార్యకర్తలతో కలసి సంఘీభావం తెలుపుతున్న చైర్‌పర్సన్ విజయ, ఎమ్మెల్సీ రామారావ తదితరులు

- జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, ఎమ్మెల్సీ రామారావు

కవిటి: ఎన్నికల్లో ఓటమి చెందినంత మాత్రాన కార్యకర్తలు అధైర్యపడవద్దని, ప్రజల పక్షాన పోరాడుదామని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ , ఎమ్మెల్సీ నర్తు రామారావు పిలుపునిచ్చారు. కళింగపట్నం బీచ్‌లో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో వన భోజన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కవిటి మండల పార్టీ కన్వీనర్ కడియా ప్రకాశ్ అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్సీ రామారావు మాట్లాడుతూ.. ఎనిమిది నెలల కూటమి పాలనపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ విజయ మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని అన్నారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో మనమంతా పనిచేయాలని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసేందుకు కార్యకర్తలు గ్రామ స్థాయిలో పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేట ఎంపీపీలు బోర పుష్ప, పైలా దేవదాస్ రెడ్డి, నిమ్మన దాసు, సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, నాలుగు మండలాల వైస్ ఎంపీపీలు, మండల పార్టీ కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.